
# లేడీస్ క్లబ్బూ....ఎల్ సీ గేటూ

అల్లదిగో కనిపిస్తోందే-కొల్లేటి కొంగ మెడలాగా, అదే బ్రాంచి లైను ఎల్‌సి గేటు. అది రైల్వే డివిజనల్ హెడ్‌క్వార్టర్సులోనే ఉన్న ఊరి శివార్లలో, రైల్వే ట్రాఫిక్  పలచగా ఉండే రోడ్డు మీద వాహనాల రాకపోక కూడా తక్కువే. రెండు కిలోమీటర్ల దూరంలోని పంచదార మిల్లు పనిచేసే సీజన్‌లో మాత్రమే ఆ ప్రాంతం అలికిడిగా ఉంటుంది. పంచదార మిల్లుకీ ఎల్‌సీగేటుకీ మధ్య సరుగుడుతోట...తోట వెనకే పేదరికంలో మగ్గుతున్న రాజకుమారిలాగా ఆలనాపాలనా లేని పాత బిల్డింగ్ 'భూత్‌బంగ్లా' అంటారు అక్కడి జనాలు. ఇంగ్లీషు వాళ్లు కంపెనీ రైల్వేల్ని నడిపిన రోజుల్లో దొరసానులు అందులో చీట్ల పేక ఆడేవారు. సిగరెట్లు కాల్చేవారు, కాక్‌టెయిల్ మరీ చిక్కపడినప్పుడు సిగపట్లు పట్టుకొనేవారు. ఆ లేడీస్ క్లబ్బులో ఖరీదైన ఉడెన్ ఫ్లోరింగ్ ఉంది. పెద్ద పెద్ద కిటికీలున్నాయి. ఫాల్సు రూఫింగూ... పండిన గోరింటాకు రంగులో బంగళా పెంకులూ....



# పొగబండి కథలు

ఓలేటి శ్రీనివాసభాను

అదంతా గతం! కథా కాలం నాటికి క్లబ్బు మూతపడింది. ఆఫీసర్ల శ్రీమతుల ఆదరణ కోల్పోయి, అదెక్కడుందో తెలీని పరిస్థితిలో ఉంది. ఆ నేపథ్యంలో ఓ రోజు ఇంద్ర రథం లాంటి సెలూన్‌లో మిస్టర్ కృష్ణమూర్తి ఆ ఊరికి కొత్త డివిజనల్ రైల్వే మేనేజర్‌గా వచ్చారు. ఆయనతో పాటు మిసెస్ కృష్ణమూర్తి, బొచ్చుకుక్కా, లిప్‌స్టిక్కు, నెయిల్‌పాలిష్షు ఎట్సెట్రా......

మేడమ్‌కి క్లబ్బు యాక్టివిటీస్ మీద ఆసక్తి ఎక్కువ. అయ్యగారు ఛార్జీ తీసుకున్న మర్నాడే అమ్మగారికి ఎల్‌సీగేటు అవతల లేడీస్ క్లబ్బు గురించి తెలిసింది. పెర్సనల్ ఆఫీసర్‌నీ, ఇంజనీర్‌నీ, ఇన్‌స్పెక్టర్లనీ వెంటబెట్టుకుని లొకేషన్‌కి వెళ్లింది.

''వాట్ ఎ స్లీపింగ్ బ్యూటీ...స్ప్రాలింగ్ సరౌండింగ్స్'' అంటూ విస్తుబోయింది. ''ఎస్ మేడమ్... ఎస్ మేడమ్'' అంటూ ఆఫీసర్లు, ఇంజనీర్లూ తాళం వేసారు. ''ఇలాంటి మాస్టర్‌ప్లేస్‌లో దెయ్యాలు తిరుగుతుంటే మీరేం చేస్తున్నారు?'' చిరుకోపంతో చలవ కళ్లద్దాల్ని తీసి, దర్పాన్నీ, హుందానీ కలిసిన చూపుల్తో తాళం వేసిన బృందాన్ని మేడమ్ నిలదీసింది. తడపడేలా చేసింది.

రాజుగారు తలుచుకుంటే చెప్పలేం గానీ, రాణిగారు తలుచుకుంటే మాత్రం దెబ్బలకే కాదు, క్లబ్బులకీ కొదవుండదు. క్లబ్బు తాళం తెరుచుకుంది. బూజులు దులిపారు. పెంకులు మార్చారు. గోడలకి డెస్టంబరూ, తలుపులకీ ద్వారాలకీ వార్నీసులూ వేసి పెళ్లివారిల్లులా సింగారించారు. మేడమ్‌గారి చూపులో కొత్త రూపు సంతరించుకున్న లేడీస్ క్లబ్బులో ఆ సాయంత్రం ఆఫీసర్ల శ్రీమతులు పోగయ్యారు. అమ్మగారిని మొదట పూలదండలతోనూ, ఆ తరువాత పొగడ్తలతోనూ ముంచెత్తారు. విందులూ, వినోదాలూ ముగిసాయి. శ్రీమతి కృష్ణమూర్తి 'తొమ్మిదో మబ్బు'లో తేలిపోతున్న వేళ వాచీలో పదిగంటలైంది.

మిసెస్ కృష్ణమూర్తి-''లెట్స్ కాల్ ఇట్ ఏడే'' అంటూ పూలదండల్నీ, బొకేల్నీ డ్రైవర్‌కి అందించి, విలాసంగా పోర్టికోలోకి వచ్చి కారెక్కింది. ఆఫీసర్ల భార్యలు మేడమ్‌గారికి స్తోత్రపాఠాలతో వీడ్కోలు చెప్పి, ఎవరి కార్లలో వాళ్లు బయల్దేరారు. సరుగుడు తోట వరకూ కామన్ డైరక్షన్‌లో వచ్చిన కార్లు, అక్కడి జంక్షన్‌లో పంచదార మిల్లు వైపు తిరిగారు. మేడమ్‌గారి కారు మాత్రం ఎడం వైపు తిరిగింది. అటు ఎల్‌సీగేటుని దాటుకొని నాలుగైదు కిలోమీటర్ల దూరంలో డివిజన్ రైల్వే మేనేజర్‌గారి బంగళా ఉంది మరి.


పావు కిలోమీటరు గడిచిందో లేదో...ఏటివాలులో పడవలా సాగిపోతున్న కారు ప్రయాణం నాటుతోవలో పోతుల బండి నడకలా మారిపోయింది.

''వెనక టైర్‌లో గాలి తగ్గినట్లుంది చూడు'' మేడమ్ చెప్పగానే డ్రైవర్ రోడ్డు వార కారుని ఆపాడు. దిగి చూశాడు.

''పంక్చరయింది మేడమ్'' చెప్పాడు

''మై గుడ్‌నెస్....స్టెఫినీ మార్చు''

డ్రైవర్ తలగోక్కున్నాడు. స్టెఫినీ ఉందిగానీ అందులో గాలి తక్కువగా ఉంది. మిసెస్ కృష్ణమూర్తి కళ్లెర్ర చేసింది. డ్రైవర్ ఎదురుగా లేడు. లేకపోతే భస్మం అయిపోయేవాడు. డిక్కీలో స్టెఫినీని



ఉంచి లాక్ చేస్తున్నాడు. మేడమ్ కిందకి దిగింది. నోటికొచ్చినట్లు తిట్లు...డ్రైవర్ తన టోపీని తల మీంచి తీసి, మేడమ్‌గారి దీవెనల్ని అందులో పట్టు కొంటున్నాడు.

''దిష్టిబొమ్మలా నిలబడ్డం కాదు. క్విక్...'' అంది పెద్దావిడ.

డ్రైవర్ తలెత్తి చూశాడు. కిలోమీటరున్నర దూరంలో ఎల్‌సీగేటు దగ్గర దీపం మిణుకు మిణుకు మంటోంది. మేడమ్‌గారి పర్మిషన్ తీసుకొని డ్రైవర్ బయల్దేరాడు. అక్కడ ఎల్‌సీ గేటు లాడ్జ్‌లో రైల్వేస్టేషన్ క్యాబిన్‌కి ఫోన్ కమ్యూనికేషన్ ఉంది. ఫోన్ ద్వారా పరిస్థితిని చేరవేస్తే మరోకారు వస్తుంది.

''చీమనడక కాదు. బీ ఫాస్ట్'' వెనక నుంచి మేడమ్ అదిలింపు విన్న డ్రైవర్ నడవలేదు. పరుగు తీశాడు.

ఎదురుగా డ్రైవర్ ఉన్నంత సేపూ పొగరుగా, బింకంగా ఉన్న మిసెస్ కృష్ణమూర్తిలో హఠాత్తుగా ఒంటరితనం స్పృహ కలిగింది. ఆ నిర్జన ప్రదేశంలో నిలువెత్తు భయంతో కారు తలుపు తెరుచుకొని, కిటికీ అద్దాలు మూసుకొని బిక్కచచ్చిపోయింది. వేసవికాలం....ఏసీ లేని కారు....ఒకటే ఉక్కపోత! కిటికీ తెరవకపోతే ఇబ్బందే! వాటిని తెరుస్తుంటే చల్లగాలి....గాలితో పాటు బీడీ పొగ వాసన...మేడమ్‌కి భయం వేసింది. కిటికీ అద్దాల్ని మళ్లీ పైకెత్తబోయింది.

''నమస్కారం మేడమ్''ఎవరిదో గొంతు. అది విన్న మిసెస్ కృష్ణమూర్తిలో కొద్దిపాటి ధైర్యం...తన స్టేటస్‌ని ఆ చీకట్లో ఎవరో గుర్తించారన్న పిసరంత అహం.

ఆవిడ సగం మూసిన కిటికీ అద్దంలోంచి చూసింది. ఎర్రగా మండుతున్న బీడీ కొస రోడ్డు మీద రాలి పడింది. ఆకారం స్పష్టంగా కనిపించ లేదు. అంతలోనే అగ్గిపుల్ల వెలిగింది. ఆ వెలుగులో లోతైన కళ్లు..గారపట్టి పళ్లు...సూదిముక్కు....బాగా మాసిన గడ్డం...మీసం.....

''నమస్కారం మేడమ్'' అన్నాడా వ్యక్తి.

''నాట్ బ్యాడ్....డ్రైవర్ వచ్చేదాకా బిక్కు మిక్కు మంటూ ఒంటరిగా ఉండాల్సిన పని బితుకూ మనిషి సాయం దొరికింది.'' మిసెస్ కృష్ణమూర్తి ఊపిరి తీసుకుంది. ఆ వ్యక్తితో మాట్లాడడం బిలో స్టేటస్. అందుకే తను నోరువిప్పకుండా ''ఊఁ...'' అంటూ అతని చేతనే మాట్లాడిస్తే సరి...

''ఊఁ...''

''అమ్మా, మీరు కరుణిస్తే, నేనూ, నా భార్యా, నలుగురు పిల్లలూ ఓ పూటైనా గడుపుతాం.

''ఊఁ..''

ఎదురుగా డ్రైవర్ ఉన్నంత సేపూ పొగరుగా, బింకంగా ఉన్న మిసెస్ కృష్ణమూర్తిలో హఠాత్తుగా ఒంటరి తనం స్పృహ కలిగింది. ఆ నిర్జన ప్రదేశంలో నిలువెత్తు భయంతో కారు తలుపు తెరుచుకొని, కిటికీ అద్దాలు మూసుకొని బిక్కచచ్చిపోయింది. వేసవికాలం....ఏసీ లేని కారు.... ఒకటే ఉక్కపోత! కిటికీ తెరవకపోతే ఇబ్బందే! వాటిని తెరుస్తుంటే చల్లగాలి....గాలితో పాటు బీడీ పొగ వాసన...మేడమ్‌కి భయం వేసింది. కిటికీ అద్దాల్ని మళ్లీ పైకెత్తబోయింది.

''అదిగో అక్కడ కనిపిస్తోంది కదమ్మా ఎల్‌సీగేటు...అందులో గేట్‌మేన్‌గా పనిచేసేవాణ్ణి. ఓసారి పంచదార మిల్లుకి వెళుతున్న చెరుకు లారీ, బ్రాంచీ నుంచి రైలు ప్యాసింజరూ అక్కడ గుద్దుకొన్నాయి. పెద్ద ప్రమాదమే జరిగింది. పొరపాటు నాదే. క్షమించమని దొరల్ని వేడుకున్నాను. నా విన్నపాలూ, నా భార్య బిడ్డల ఏడుపులూ గాల్లో కలిసి పోయాయి. నా నౌఖరీ పోయింది. ఇల్లు గడవడం లేదు తల్లీ. మీరు కరుణించి మీ బంగళాలో గడ్డిపీకే పని ఇచ్చినా చాలు. గొడ్డు చాకిరీ చెయ్యడానికి సిద్ధం....'' గడ్డం మనిషి బతిమాలుతున్నాడు. చెప్పిందే చెపుతున్నాడు. మేడమ్ ఊఁ అంటోంది. చెప్పిందే చెప్పనిస్తోంది. 'డిలే టాక్టిక్స్' ప్లే చేసి, దీనుణ్ణి మాట్లాడనిస్తోంది. ఆ పుణ్యకాలం అలా గడవగానే దూరం నుంచి కారు లైట్లు రోడ్డుతో పాటు మెలికలు తిరుగుతూ కనిపించాయి.

ఆ కారు దగ్గరపడింది. ఆవిడున్న కారు దగ్గర ఆగింది. ఇద్దరు డ్రైవర్లు దిగారు. ఒక డ్రైవర్ స్టెఫినీ తీసుకొని మేడమ్ గారి కారు దగ్గరకి వచ్చి డోర్ తెరిచాడు. మేడమ్ తన కారు దిగి గచ్చపొదలో జారుతున్న మచ్చల పాము లాగా మరో కారులోకి మారింది. ''అమ్మగారూ....'' అంటూ దీనుడి గొంతు ఆవిడకి వినిపిస్తూనే ఉంది. కారు చీకట్లో కలిసిపోయింది.

ఎల్‌సీగేటు దగ్గర పడగానే కారు వేగం హెచ్చింది. చక్రం గోతిలో దిగి లేచింది. మేడమ్ తలకాయ టాప్‌కి తగిలింది. ఆవిడ డ్రైవర్‌ని తిట్టి పోసింది. స్పీడ్ తగ్గించమంటూ కేకలేసింది. బంగళాకి చేరేవరకూ, చేరిన తరువాత కూడా డ్రైవర్ మీద తిట్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

కారు తలుపులు తెరిచి, తల మీంచి టోపీ తీసి–

''క్షమించండి మేడమ్.... రెండు నెలల క్రితం ఎల్‌సీగేటు దగ్గర రైలు కిందపడి ఓ గేట్‌మేన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఏదైనా పని ఇప్పించమంటూ దారిన పోయేవాళ్లని దెయ్యమై వెంటపడుతున్నాడని జనం చెప్పుకుంటున్నారు. అందుకే భయంతో వేగం పెంచాను...'' అంటూ తన ఉద్యోగం పోకుండా అమ్మగారి కాళ్ల మీద పడ్డాడు.

మిసెస్ కృష్ణమూర్తి వెన్నులో వణుకు పుట్టింది.

ఎల్‌సీ గేటు అవతల లేడీస్ క్లబ్బుకి మళ్లీ తాళం పడింది.

*

